

# కథకుడి కథ

-కర్లపాలెం హనుమంతరావు

**సాయంత్రం** ఆఫీసు నుంచి ఇంటికి వచ్చేసరికి—

అలవాటుగా తెల్ల చీర కట్టుకుని, మల్లె పూలు పెట్టుకుని, చిరునవ్వులు చిందిస్తూ గుమ్మంలో నిలబడి ఉండవలసిన అలివేణి, నట్టింట్లో నేలమీద మీద అమ్మలక్కల మధ్య అశోకవనం కింద సీతాదేవిలా ఉన్న దృశ్యం.

నా రాకతో ఆడంగు లందరూ భుజాల నిండుగా కొంగులు సర్దుకుంటూ బిలబిలమంటూ గది ఖాళీ చేసేశారు.

అలివేణి మాత్రం పోజు మార్చలేదు. చింకి చాపమీద మరింత ముడుచుకు కూర్చుంది. ఏదో జరగరానిదే జరిగింది.

"అలివేణీ!" అని పిలిచాను. పలుకులేదు, ఉలుకూ లేదు.

వంటింట్లోకి జొరబడి, రెండు కప్పుల కాఫీ కలుపుకు వచ్చాను.

వేడి కాఫీ వాసనకు వాతావరణంలో టెన్షన్ కొద్దిగా సడలింది. వద్దంటూనే కాఫీ అందుకుని, మొహం ఇంత చేసుకుని, "ముందు నా కిది చెప్పండి— మీ రా ముదనష్టపు కథలు వ్రాయటం మానతారా? నన్ను పుట్టింటికి పొమ్మన్నారా?" అని బావురుమంది.

"అస లేమయింది?" అనడిగాను చిరాకుగా.

"ఇంకేం కావాలి? పోయిన వారం కథల పోటీలో మీరు వ్రాసిన కథకు బహుమతి వచ్చి, మీ ఫోటోతో సహా అచ్చు కావటం కాదు కాని, నాకు చచ్చే చావొచ్చి పడింది" అని మళ్ళీ రాగం అందుకుంది.

"దానికి ఏడుపు ఎందుకు?"

"ఏడుపు కాక ఏమిటి నా ముఖానికి! మీ కేం? మీరు బాగానే ఉన్నారు. ఆ కథలో మొగుణ్ణి ఆరళ్ళు పెట్టే పెళ్ళాన్ని నన్ను చూసే వ్రాశారని, పెళ్ళానికి బుద్ధి చెప్పటానికి పొరుగింటి ఆవిడతో సరసాలాడటం మీరు అనుభవం మీదే వ్రాశారని, నా కాపరం గుండమయిపోతుందని సానుభూతి చూపించటానికి వచ్చారండీ వీళ్ళంతా!"

నాకు నవ్వాగలేదు.

"మరయితే కొంప తీసి నువ్వూ అలాగే అనుకుంటున్నావా, అలివేణీ?" అని అడిగాను నాటక ఫక్కీలో.

"ఏమో—ఎవరికి తెలుసు? నేను పుట్టింటికి పోయినప్పుడు ఎక్కడెక్కడ వూరేగారో నేను చూశానా?" అంది అనుమానంగా.

"అయితే ఒక పని చెయ్యి. నీ వసలు పుట్టింటికే వెళ్ళకు."

"అలాగయితే మీ రిక కథలు వ్రాయకండి!" అంది ప్రాధేయ పూర్వకంగా.

"అది నా వల్ల కాదు."

"పోనీ, ఇలాంటి కథలు వ్రాయకండి, బాబూ! వ్రాసినా, ఫోటోతో సహా అచ్చేయించుకో వద్దు" అని రాజీకి వచ్చింది.

"సరేలే" అన్నాను, అలివేణిని తాత్కాలికంగా శాంతింప చేయటానికి.

కాని, నిజంగా ఈ బహుమతి కథతో నాకు పెద్ద చిక్కే వచ్చి పడింది. మరునాడు ఆఫీసుకు వెళ్ళినప్పుడు ఆచారి హఠాత్తుగా కావలించేసుకున్నాడు. కారణ మేమిటంటే—"అదృష్టవంతుడి వంటే నువ్వే, గురూ! కథలు వ్రాసి పేరుకు పేరూ, డబ్బుకు డబ్బూ కొట్టేయటమే కాకుండా, పక్క ఇంటి పిట్టల్ని కూడా పట్టుకుంటున్నా వన్నమాట!" అదీ వీడి ఏడుపు! దాదాపు స్టాఫులోని మగాళ్ళందరి జెలసీ ఇదే! వీళ్ళ కేం చెబుతా? మునుపు కాస్త చనువుగా, సరదాగా ఉండే లేడీ స్టాఫయితే నన్ను చూసి ఇప్పుడు పూర్తిగా బెదిరి పోయారు. మధ్య మధ్యలో మా ఆవిడని గురించి జాలితో కామెంట్సు పాస్ చేసుకోవటంకూడా విన్నాను.

ఆ రోజు సాయంత్రం మానేజరు నన్ను తన గదిలోకి పిలిచాడు.

"చూడు, మిస్టర్ ఆనంద్! మన స్టాఫ్‌లో మీ లాంటి రచయిత ఉండటం నిజంగా నాకు గర్వ కారణం" అని ఒక పది నిమిషాలు తైరు కొట్టి, కాఫీ తెప్పించి తాగిన తరవాత మరో పది నిమిషాలు నీతి నియమాల మీద లెక్చరిచ్చి చివరికి అసలు విషయం బయట పెట్టాడు. "మీ రింత కాలం రచయితలని తెలియదు. మీ అమూల్యమయిన సమయాన్ని నా డాటర్‌కు ట్యూషన్ చెప్పడం ద్వారా వేస్టు చేయటం నాకు నచ్చలేదు. అందుచేత ఆవిడ ప్రయివేట్ స్టడీస్‌కి వేరే అరేంజిమెంట్ చేశాను."

ఇతని మనస్తత్వం ఇలా బయట పడింది. తన కూతుర్ని ఎక్కడ అంటుకుంటానో అని భయపడి పోయాడన్నమాట. కొంత నవ్వు, కొంత బాధ. తరవాత తరవాత మరిన్ని చిత్రమైన అనుభవాలు.

పుట్టింటి నుండి ఉత్తరం వచ్చిందని అలివేణి వెళ్ళిపోయింది. అంతకు

ముందు అలాగే నేనొక్కణ్ణే ఇంట్లో వండుకుంటే ఇరుగు పొరుగు అమ్మలక్కలు —"అన్నయ్యా! ఈ కూర తీసుకోండి!"

"మగవాళ్ళు మీ రేం చేసుకుంటారు? మా ఇంట్లో భోజనం చేయండి" అనే వాళ్ళు. ఈ సారి ఇటు వైపు కన్నెత్తి చూడలేదు సరికదా—నన్ను చూడగానే మైలు దూరం ఒదిగిపోయి నడిచి పోతున్నారు.

నాకూ ఈ వాతావరణం చికాకనిపించి హోటల్లో భోజనం చేయటం మొదలు పెట్టాను. ఒక రోజు హోటల్‌లో భోజనం చేసి సెకండ్ షో సినిమా చూసి ఇంటికి వచ్చి గది తలుపులు తీస్తూంటే ఎదురింటి పానకాలరావు భార్యను పిలకబాదటం కనిపించింది. ఎంత వద్దనుకున్నా వాళ్ళ తగవు మధ్య నా పేరు వినపడటంతో ఆగిపోయాను. "చెప్పు—ఈ పుస్తకం నీ దగ్గర కెట్లా వచ్చిందే? అసలు వాడి గదిలో కెందుకు కెళ్ళావు? నీ మోహానికి తోడు ఇద్దరు మొగుళ్ళు కావలసి వచ్చారటే?"

నా రక్తం ఉడికి పోయింది. ఒక్క ఉదుటున పోయి వాడి జుట్టు పట్టుకున్నాను. అనుకోని ఈహటాత్పరిణామానికి పానకాలరావు నివ్వెరపోయాడు కాబోలు, నోట మాట రాకుండా నిలబడి పోయాడు. అతని భార్య పెదవి చిట్లి రక్తం కారుతూ ంటే బాధతో ఏడుస్తూంది. ఇంకొక్క క్షణం అక్కడ ఉండలేక ఆ పుస్తకం తీసుకుని వచ్చేశాను. అది నాదే. అలివేణి ఉన్నప్పుడు ఈవిడ తీసుకు వెళ్ళి ఉంటుంది. ఇప్పుడు ఈ అనుమానపు పిశాచి కంటబడి ఇంత ఘోరం చేసింది.

మరునాడు ఉదయమే ఇల్లుగలాయన వచ్చాడు—"ఈ నెలాఖరికి ఇల్లు ఖాళీ చేయం"డంటూ. ఎందుకని అడగలేదు, అతని వెనకాలే నిలబడి ఉన్న పానకాలరావును చూసి. అంతా అర్థమయింది.

ఆ రోజు నుండి ఇళ్ళ వేట ఆరంభించాను.

నా పేరు ప్రఖ్యాతులు ఇంత త్వరగా ఈ వూళ్ళో వ్యాపించాయని నాకప్పుడే తెలిసింది.

నా పేరు విని నన్ను చూసి కొంతమంది ఇల్లు ఖాళీ ఉండికూడా లేదన్నారు. కొంతమంది మొహమాటం లేని వాళ్ళయితే "మంచి ఫామిలీస్‌కే ఇస్తాం" అన్నారు. మొహమాటం ఉన్న వాళ్ళయితే—"మీ ఆడవాళ్ళను వచ్చి చూసి పొమ్మనండి—అప్పుడు మాట్లాడుకుందాం!" అన్నారు. అడిగి అడిగి కాళ్ళు బొప్పులు పుట్టడమే కాని ప్రయోజనం లేకపోయింది. అద్దె కొద్దిగా ఎక్కువ ఇస్తానన్నా ఆశ పడి ముందు ఒప్పుకున్న ఒక ఆసామి రెండవ రోజు డబ్బు ఇవ్వటానికి వెళితే కొత్త 'వంక' చెప్పి ఇల్లు ఖాళీ లేదన్నాడు.

స్టాఫు మెంబర్సందరికీ చెప్పి చూశా. చూస్తామన్న వాళ్ళే కాని చూసిన వాళ్ళెవరూ లేరు. వాళ్ళ ఇళ్ళ పక్కన చేరితే వాళ్ళ సంసారాలకేం మూడుతుందోనని భయమనుకుంటా. ఒక రోజు వామన మూర్తి లంచ్ టైంలో నన్ను కలుసుకుని, "మీరు ఇళ్ళ కోసం వెతుకుతున్నారు గదా? మా పక్క వాటా ఖాళీ అయింది. మీ కిష్టమయితే చేరండి" అన్నాడు. అమృతం దొరికినంత ఆనందమయింది. వామనమూర్తితో నాకు అట్టే పరిచయం లేకపోయినా అతని మంచితనం నన్ను ఆకట్టుకుంది. అలివేణి రాగానే ఆ ఇంటికి మారిపోయాను.

రోజులు సాగుతూనే ఉన్నాయి. నా రచనా వ్యాసంగం మాత్రం మానలేదు, ఎవరెన్ని విమర్శలు చేసినా. అలివేణికి, వామనమూర్తి భార్య వైదేహికి మంచి స్నేహమయింది. మా రెండు కుటుంబాల మధ్య రాకపోకలు తరుచుగా జరుగుతున్నాయి.

ఆ రోజు అలివేణి చిన్ని కూతురు పెండ్లి అని వూరు వెళ్ళింది. ఖాళీగా ఉండటంతో అంతకు ముందెప్పుడో సగం వ్రాసిన కథ పూర్తి చేద్దామని కూర్చున్నాను. గడియారం పది గంటలు ఎప్పుడు కొట్టిందో తెలియలేదు. తలుపు దగ్గర చప్పుడయితే తల ఎత్తి చూశాను. వైదేహి లోపలికి వచ్చి తలుపు వేసింది. ఒక్క క్షణం నా కర్థం కాలేదు. వామనమూర్తి ఆఫీసు పనిమీద క్యాంపుకి వెళ్ళి ఉన్నాడు. ఆవిడ నవ్వుతూ వచ్చి నా పక్కను కూర్చోబోయింది. నేను దిగ్గున లేచి నిలబడ్డాను.

ఆవిడ కంగారు పడింది. "మీ కిష్టం లేదా?" అని అడిగింది తడబడే గొంతుతో.

"నా కిష్టమవుందని ఎవరు చెప్పారు?" అన్నాను కటువుగా.

"మరి మీ కథ?"

నాకు పిచ్చి ఆవేశం ముంచుకు వచ్చింది. గబగబా బీరువా దగ్గిరికివెళ్ళి కథ అచ్చయిన పుస్తకాన్ని బయటికి లాగి కథ కాగితాల్ని బయటికి లాగి, "అదిగో! దీనివల్లే కదా మీ రందరూ నన్నిలా షేక్ చేస్తున్నారు" అంటూ కసిగా పరమని కాగితాల్ని చించేశాను. ఆవిడ బిత్తరపోయింది. తడబడే అడుగులతో వడివడిగా తలుపు గడియ తీసుకుని బయటికి వెళ్ళిపోయింది. ★

